క్లుప్తంగా

'రైతు బీమా'ను వినియోగించుకోండి

కూసుమంచి: రైతు బీమా పథకాన్ని కొత్తగా పాస్ పుస్తకాలు పొందిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కూసుమంచి ఏడీఏ సతీష్ కోరారు. బుధవారం కూసుమంచి, నాయకన్‌గూడెం క్లస్టర్ల పరిధిలో దరఖాస్తుల నమోదును ఆయన పరిశీలించారు. రైతులు ఈ పథకం ద్వారా రూ.5లక్షల బీమా పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ వాణి, ఏఈఓలు ప్రియాంక, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

పేద యువతి వివాహానికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న నాయకులు

కూసుమంచి: మండలంలోని హట్యాతండా గ్రామానికి చెందిన గుగులోత్ తిమ్మి కుమార్తె భానుప్రియ వివాహం గురువారం జరుగనుండగా.. మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి రూ.30వేల ఆర్థిక సాయం అందించారు. బుధవారం ఇట్టి నగదును బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వేముల వీరయ్య, తదితరులు వధువుకు అందజేశారు. ఈమేరకు కందాలకు కుటుంబసభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలకు అండగా బీఆర్‌ఎస్

ఖమ్మంవైరారోడ్: ఉమ్మడి ఖమ్మం జిల్లా బీఆర్‌ఎస్ శ్రేణులు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ బాధితులకు అండగా నిలవాలని మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పార్టీ కార్యకర్తలకు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాగునీరు, పాలు, ఆహారం, దుస్తులు వంటి అవసరాలు తీర్చడంలో సాయపడాలన్నారు. ప్రభుత్వ అధికారులు, వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని కోరారు. బీఆర్‌ఎస్ నాయకులు సహాయక చర్యల్లో స్థానిక ప్రభుత్వ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

ఎంపీ జన్మదిన వేడుకలు

ఖమ్మం అర్బన్: రాజ్యసభ సభ్యురాలు, కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి జన్మదిన వేడుకలను బుధవారం ఖమ్మంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మదర్ థెరిస్సా అనాథాశ్రమంలో ఖమ్మం మార్కెట్ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్ ఆధ్వర్యాన కేక్ కట్ చేసి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్పొరేటర్ మలీదు వెంకటేశ్వర్లు, నాయకులు బాషా, పూర్ణ, రామ్మూర్తి, రెంటాల ప్రసాద్, నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు తాకొద్దు

కామేపల్లి: వర్షాల కారణంగా విద్యుత్ స్తంభాలను తాకొద్దని విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయం ఏర్పడిందని రైతులు, విద్యుత్ వినియోగదారులు స్తంభాలను తాకడం, మరమ్మతులు చేయడం వంటి పనులు చేయడం ప్రమాదకరమన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన, స్తంభాలు విరిగినా వెంటనే ఆయా విద్యుత్ సబ్ స్టేషన్లకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇందులో కొత్తలింగాల – 87124 83571, పొన్నేకల్ – 87124 83580, కామేపల్లి – 87124 83574, ముచ్చర్ల – 87124 83579 లేదా టోల్ ఫ్రీ నంబర్ 1912కు సమాచారం ఇవ్వాలని కోరారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కూలీ
వినోద	వార్–2, మహావతార్ నర్సింహా
సాయిరాం	కూలీ
ఆదిత్య	సు ఫ్రం సో
శ్రీనివాస	వార్–2, అతడు

– ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	46	బచ్చలికూర	4
వంకాయ	30		20
బెండకాయ	18	పాలకూర	3
పచ్చిమిర్చి	34		20
కాకర	30	చుక్కకూర	3
బోడ కాకర	140		20
బీర	44	తోటకూర	4
దొండ	24		20
పొట్లకాయ	36	గోంగూర	4
చిక్కుడు	36		20
గోరుచిక్కుడు	40	మెంతికూర	3
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	40	కొత్తిమీర	1
ఆలుగడ్డ	24		25
చామగడ్డ	28	పుదీన	1
క్యారెట్	50		20
క్యాప్సికం	60	-ఖమ్మం వ్యవసాయం	

స్ఫూర్తి నింపేలా..



బహుమతులు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మహనీయుల త్యాగాలపై వ్యాసరచన పోటీలు

- ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్‌లో పోటీల నిర్వహణ
- ఉత్సాహంగా పాల్గొన్న డిగ్రీ విద్యార్థులు

ఖమ్మంసహకారనగర్: రానున్న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని డిగ్రీ కళాశాలల విద్యార్థులకు బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'భారతదేశ స్వాతంత్రోద్యమం – ప్రపంచానికి ఆదర్శం'అనే అంశంపై ఖమ్మంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో పోటీలు నిర్వహించగా.. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పోరాటం.. అనుసరణీయం

ఎందరో మహనీయులు అహింసా మార్గంలో సాగించిన స్వాతంత్ర్య పోరాటం తరతరాలకు అనుసరణీయమని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా పేర్కొన్నారు. నాటి మహనీయుల పోరాట స్ఫూర్తిని విద్యార్థులకు తెలిసేలా పోటీలు నిర్వహించామని తెలిపారు. కాగా, పోటీల్లో వి.లక్ష్మీశ్రీజ(కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల), ఎం.డీ.అజ్రు(ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్), ఐ.ఉమ(తెలంగాణ సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల) వరుసగా మొదటి మూడు బహుమతులు గెలుచుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల బాధ్యులు సునంద, ధనమూర్తి, లక్ష్మణరావు, నర్సింహారావు, అజిత్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శాంతితో ఏదైనా సాధించవచ్చు



స్వాతంత్ర్యోద్యమం మన భారతజాతికి విశేషమైన ప్రేరణ కలిగించింది. శాంతియుతంగా ఏదైనా సాధించవచ్చని ప్రపంచానికి చాటి చెప్పింది. మన పోరాటం అనేక దేశాలకు ఆదర్శంగా నిలిచింది.

– ధారా కారుణ్య స్రవంతి, మద్దులపల్లి కళాశాల

స్ఫూర్తిదాయకం



ఏ జాతి ప్రజలకైనా భారత స్వాతంత్ర్యోద్యమం దారి దీపం. అహింసతో, సమానంతో మన జాతిని విముక్తి చేసుకోవడం ప్రతీ తరానికి స్ఫూర్తిదాయకం. నిరంతరం ప్రేరణ కలిగిస్తుంది.

– బి.వీరప్రసాద్, నేలకొండపల్లి కళాశాల

ప్రేరణ.. ఆత్మవిశ్వాసం



స్వాతంత్ర్యోద్యమ పోరాటయోధుల స్ఫూర్తి భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా ఉంది. 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేళ దేశ స్వాతంత్ర్యయోధులను తలుచుకోవడంతో గొప్పప్రేరణ, ఆత్మ విశ్వాసం కలుగుతాయి.

– టి.దీప, గార్ల కళాశాల

విజయావకాశాలు ఉన్న వారికే టికెట్లు



మాట్లాడుతున్న పువ్వాళ్ల దుర్గాప్రసాద్

నేలకొండపల్లి: స్థానిక సంస్థల సందర్భంగా సర్వే చేసి గెలిచే అవకాశం ఉన్న వారికే టికెట్లు ఇస్తామని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలోని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడిన వారికి తప్పక న్యాయం జరుగుతుందని, పార్టీలో ఉంటూ ఎవరైనా క్రమశిక్షణ తప్పితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. జిల్లాలో నూటికి నూరు శాతం స్థానాల్లో గెలిచేలా పార్టీ శ్రేణులు కష్టపడాలని కోరారు. అనంతరం సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకులు తుంబూరు దయాకర్ రెడ్డి, సౌజన్య, సత్యనారాయణ, నారాయణ, శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, భద్రయ్య, బొందయ్య, బచ్చలకూరి నాగరాజు, కొచ్చెర్ల శ్రీనివాసరావు, మేకల వెంకటేశ్వర్లు, కొమ్మినేని విజయ్, వడ్లమూడి నర్సయ్య, రాయపూడి నవీన్, చిదుముల జాన్‌రెడ్డి, వంగవీటి నాగేశ్వరరావు, వెంకన్న, సురేష్‌నాయక్, కడియాల నరేష్, యడవల్లి నాగరాజు, బోయిన వేణు, సూరేపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

యువత భవిష్యత్‌ను కాపాడండి



బైక్ ర్యాలీ తీస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: యువత భవిష్యత్‌ను కాపాడాలని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్వీ రాకేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిక్కుల భరత్, జిల్లా అధ్యక్షుడు జాటోత్ ప్రేమ్‌సింగ్ కోరారు. ఈమేరకు బుధవారం ఖమ్మం నగరంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ కార్యాలయం నుంచి కొత్త బస్టాండ్, రాపర్తినగర్ మీదుగా బస్ డిపోరోడ్డు, పాత బస్టాండ్, జెడ్పీసెంటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా గ్రంథాలయంలో మత్తు పదార్థాలపై నిర్వహించిన సెమినార్‌లో వారు మాట్లాడుతూ.. యువతకు ఉపాధి అవకాశాలు లేకనే పక్కదారి పడుతున్నారని, అయినా ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని, చెడు వ్యసనాలను బెట్టింగ్ యాప్స్‌ను బెల్టు షాపులను నిర్మూలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా నాయకుడు ఇస్లావత్ రమేష్, మామిడాల వెంకటేష్, నాయకులు మోహన్‌రావు, శివలాల్ శంకర్, రవి, ప్రసాద్, శ్రీను, వినయ్, కె.రవి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు అప్పగింత



కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు, అన్నం శ్రీనివాసరావు

ఖమ్మంఅర్బన్: గత ఐదేళ్ల క్రితం మతిస్థిమితం లేకుండా ఖమ్మం అర్బన్ మండలం వేపకుంట్లకు వచ్చిన ఓ యువకుడిని అన్నం సేవా ఫౌండేషన్‌కు అప్పగించగా.. అతడు కోలుకుని తన పేరుతో పాటు కుటుంబ సభ్యుల వివరాలు తెలిపాడు. దీంతో బుధవారం ఖమ్మం అర్బన్ పోలీసుల ఆధ్వర్యాన ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు కుటుంబసభ్యులకు అప్పగించారు. తన పేరు సోన నేలాల్ కుమార్ అని, ఊరు బంగచ్చ, తెల్మార్ తాలూకా, నలందా జిల్లా బీహార్ రాష్ట్రం అని చెప్పడంతో అతడి తల్లి మింతర్ దేవి, తాతయ్య దులర్ చంద్ పాశ్వాన్, బాబాయి సుభాష్ పాశ్వాన్‌లకు అప్పగించినట్లు తెలిపారు. ఈమేరకు శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.

మైనారిటీ గురుకుల సెక్రటరీని తొలగించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: మైనారిటీ గురుకుల సెక్రటరీని తక్షణమే విధుల నుంచి తొలగించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలస్తీనా సంఘీభావ ర్యాలీలో పాల్గొన్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వడ్లమూడి గీతాంజలి, చావా ప్రణీత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఖమ్మం విభాగ్ సంఘటన కార్యదర్శి సామల అఖిల్‌రెడ్డి, అజయ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ సమాచారం..

చెత్త ఏరుకునే వారికి గుర్తింపు కార్డులు..

నగరంలో చెత్త ఏరుకునేవారికి, డంపింగ్‌యార్డ్‌లో ర్యాట్‌పీకర్స్‌కు గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు మెప్మా అధికారులు తెలిపారు. బుధవారం కేఎంసీలో రోడ్ల వెంట చెత్త సేకరించేవారు, డంపింగ్‌యార్డ్‌లో ర్యాట్ పీకర్స్, స్క్రాప్ షాపులు నడిపే వారితో సమావేశం నిర్వహించారు.

చెట్లను నరికిన వారికి జరిమానా..

నగరంలోని 56వ డివిజన్ గట్టయ్యసెంటర్‌లో రోడ్డు వెంట ఉన్న చెట్లను నరికిన వారికి కేఎంసీ అధికారులు రూ.20 వేలు జరిమాన విధించారు. ఉద్యాన అధికారి బెల్లం రాధిక, శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్య జరిమానా విధించి, చెట్లు నరికితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డ్రెయినేజీలపై ఆక్రమణల తొలగింపు



డ్రెయినేజీపై డబ్బా కొట్లను తొలగిస్తున్న సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని ఆర్టీఓ ఆఫీస్ నుంచి సరితాక్లినిక్ సెంటర్ వరకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న డ్రెయినేజీలపై చేపట్టిన నిర్మాణాలు, డబ్బా కొట్లు, నేమ్ బోర్డులను కేఎంసీ అధికారులు బుధవారం తొలగించారు.

ఆక్రమణను తొలగించాలని వినతి

కామేపల్లి: మండలంలోని మద్దులపల్లి గ్రామంలోని పాత ఊరు గొలుసు డొంక ద్వారా పంట పొలాలకు వెళ్లే రహదారి ఇరువైపులా ఆక్రమణకు గురైందని, తద్వారా పంట పొలాలకు వెళ్లలేకపోతున్నామని బుధవారం హైదరాబాద్‌లో జాతీయ ట్రైబల్ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్‌కు బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు జాలె శ్రీను ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపాడు.

'కడివెండి'కి అరుణాచల్ గవర్నర్ నుంచి ఆహ్వానం



వేణుగోపాల్, అరుణ దంపతులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంకు చెందిన పర్యావరణ వేత్త కడివెండి వేణుగోపాల్, అరుణ దంపతులకు అరుణాచల్‌ప్రదేశ్ గవర్నర్ కై వల్య త్రివిక్రమ్ పర్నాయిక్ నుంచి ఆహ్వానం అందింది. పర్యావరణవేత్తగా, ఎకో– క్లబ్ ఎన్విరాన్‌మెంటల్ సొసైటీ వ్యవస్థాపకులుగా వ్యవహరిస్తున్న వేణుగోపాల్ దంపతులు గురువారం అరుణాచల్ ప్రదేశ్ రాజధాని ఇటానగర్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ రహిత సమాజంపై రూపొందించిన నివేదికను సమర్పించనున్నారు.

అవగాహన ఒప్పందం

ఖమ్మం సహకారనగర్: హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ (హెచ్‌ఐఈఈ)తో తమ కళాశాల ఈఈఈ, ఈసీఈ విభాగాలు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయని ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల పాటు విద్యార్థులకు ప్రాక్టికల్ ఆధారిత సదస్సులు, పరిశ్రమల సందర్శన, ప్లేస్‌మెంట్స్, రియల్ టైమ్ ప్రాజెక్టు, ఎలక్ట్రికల్ ఎమ్మెస్పీ సంస్థల్లో ఉద్యోగాలకు సంబంధించిన శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, కళాశాల అకడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఏవీవీ శివప్రసాద్, జె.రవీంద్రబాబు, కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కె.మదన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి..

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం అల్లీపురంకు చెందిన మున్నూరుకాపు సంఘం రాష్ట్ర నాయకుడు బొమ్మిశెట్టి శ్రీనివాస్ తండ్రి బొమ్మిశెట్టి చిన్న కృష్ణయ్య మృతి చెందగా.. బుధవారం మున్నూరుకాపు సంఘం నాయకుడు గుండాల కృష్ణతో పాటు జీవీఎల్ నరసింహారావు, కోనేటి నారాయణ తదితరులు సంతాపం తెలిపారు. కుటుంభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

డిక్షనరీల పంపిణీ

ఖమ్మం అర్బన్: నగరంలోని వెలుగుమట్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యాన బుధవారం పాఠశాలలో ఇంగ్లిష్ డిక్షనరీలు పంపిణీ చేసినట్లు పీఆర్‌టీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు తెలిపారు. హెల్పింగ్ హ్యాండ్ సభ్యుడు, రిటైర్డ్ హెచ్‌ఎం మద్దినేని ప్రసాద్‌రావు మనవరాలు మేఘన పుట్టినరోజు సందర్భంగా పంపిణీ చేశారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రమీల, ఉపాధ్యాయ బృందం సిరిపురపు రమణారావు, ఉదయలక్ష్మి, రవి కిరణ్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు విస్తృత తనిఖీలు



లాడ్జిలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

ఖమ్మంక్రైం: నేరాల నియంత్రణ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేసేందుకు పోలీస్ కమిషనరేట్ పరిధిలో బుధవారం విస్తృత తనిఖీలు నిర్వహిస్తుందని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. విజిబుల్ పోలీసింగ్ పటిష్టంగా అమలు చేస్తేనే నేరాలు, దొంగతనాలు నియంత్రణలో ఉంటాయన్న నేపథ్యాన గత వారం రోజులుగా తనిఖీలు నిర్వహిస్తున్నామని, పోలీస్ గస్తీ పెంచి పెట్రోలింగ్ ముమ్మరంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. హోటళ్లు, లాడ్జిల్లో సోదాలు నిర్వహించడం, సరిహద్దు రాష్ట్రాల మీదుగా గంజాయి, రేషన్ బియ్యం, ఇసుక వంటి అక్రమ రవాణా, పాత నేరస్తుల కదలికలను కట్టడి చేసేలా ముమ్మర తనిఖీలు చేస్తున్నారని చెప్పారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు స్థానిక ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని, వ్యాపారస్తులు కచ్చితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

'ఓట్ల చోరీలో దోషిగా ఎన్నికల సంఘం'



సమావేశంలో మాట్లాడుతున్న హేమంతరావు

ఖమ్మంమయూరిసెంటర్: ఓట్ల చోరీకి బీజేపీకి సహకరించి భారత ఎన్నికల సంఘం దేశ ప్రజల ముందు దోషిగా నిలబడిందని, సమాధానం చెప్పుకోలేని స్థితిలో అవేతనంగా మారుతుందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. బీజేపీ గెలుపు కోసం ఎన్నికల సంఘం అనేక అడ్డదారులు తొక్కిందన్నారు. బుధవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో యర్రాబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో సుప్రీంకోర్టులో ఓట్ల తొలగింపుపై విచారణ జరుగుతున్న సందర్భంలో మరణించినందున తొలగించామని –ఎన్నికల సంఘం న్యాయవాదులు చెబుతుండగా వారు సజీవులుగా న్యాయస్థానానికి హాజరుకావడంతో ఎన్నికల సంఘం తలదించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర మహాసభలు ఈనెల 20 నుంచి 22 వరకు మేడ్చల్‌లో జరుగనుండగా.. మహాసభలకు జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి కె. నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, చాడ వెంకటరెడ్డి తదితరులు హాజరవుతారున్నారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మానికి చేరిన కలశ యాత్ర



యాత్ర ర్యాలీని ప్రారంభిస్తున్న మల్లిబాబుయాదవ్

ఖమ్మంగాంధీచౌక్: అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న రెజింగ్ లా రాజ్ కలశ యాత్ర బుధవారం ఖమ్మంకు చేరింది. ఈమేరకు యాత్ర ర్యాలీని మయూరిసెంటర్ నుంచి మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షుడు మేకల మల్లిబాబుయాదవ్, జిల్లా అధ్యక్షులు చిలకల వెంకటనర్సయ్యలు ప్రారంభించగా.. ఎన్టీఆర్ సర్కిల్ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో మహాసభ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చిత్తారి సింహాద్రి, లోడంగి గోవర్దన్, జక్కుల శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ.. నాలుగు నెలల క్రితం బీహార్‌లో ప్రారంభమైన యాత్ర నవంబర్ 18న ఢిల్లీకి చేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, నక్క మహేష్, సైదులు, దుబాకుల శ్రీను, విజయలక్ష్మి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ శిక్షకురాలికి అవార్డు



అవార్డు అందుకుంటున్న విజయ

ఖమ్మంగాంధీచౌక్: వివిధ వర్గాల వారికి ఆన్‌లైన్‌లో శిక్షణనిస్తున్న ఖమ్మానికి చెందిన ఎస్.విజయకు డిజిటల్ మహిళా అచ్యూవర్ అవార్డు లభించింది. హైదరాబాద్ డిజిటల్ మహిళా సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ అశ్లేష ఈ అవార్డును బుధవారం సంస్థ కార్యాలయంలో విజయకు అందించారు. విజయ ఏజెన్సీస్ పేరిట జీఎస్టీ బిల్లింగ్, అకౌంట్స్ నిర్వహణ, స్టాక్ క్రియేషన్స్, బ్యాంకు లావాదేవీలు వంటి కార్యకలాపాలపై శిక్షణనిస్తుండగా.. అవార్డుకు ఎంపికయ్యారని పేర్కొన్నారు.

చెరువుమాధారం వాసికి గోల్డ్ మెడల్

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం గ్రామానికి చెందిన నందిగామ భాగ్యలక్ష్మి కాకతీయ యూనివర్సిటీలో లైబ్రరీ సైన్స్ కోర్స్‌లో ప్రథమ ర్యాంకు సాధించగా. వైస్ చాన్సిలర్ ప్రతాప్‌రెడ్డి, గ్రంథాలయ ఇన్‌చార్జ్ రాధికరాణిలు ఆమెకు గోల్డ్ మెడల్ అందించారు. ఈ సందర్భంగా స్థానికులు బుధవారం భాగ్యలక్ష్మిని సన్మానించి ఆమె తల్లిదండ్రులు రాజశేఖర్–రాధలను అభినందించారు.

మురికిగా తాగునీరు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని గాంధీచౌక్ ప్రాంతంలో బుధవారం సరఫరా అయిన నీటిలో మురికి నీళ్లు వచ్చినట్లు స్థానికులు తెలిపారు. బిందెలు, బకెట్లలో నీరు పట్టగా ఎర్రగా, బురద నీరు వచ్చిందని పలువురు మంచినీళ్ల ఫొటోలు తీసి వాట్సాప్ గ్రూప్‌ల్లో పెట్టారు. అధికారులు స్పందించి తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంపత్‌కుమార్

తిరుమలాయపాలెం: డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా చేరి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని మండల ఐకేపీ ఏపీఎం సంపత్‌కుమార్ అన్నారు. బుధవారం తిరుమలాయపాలెం రైతు వేదికలో నూతన డ్వాక్రా సంఘాల పెంపుపై గ్రామ సమాఖ్య సభ్యులకు నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇంటింటి సర్వే నిర్వహించి ప్రతీ మహిళను సంఘాల్లో చేర్పించనుండగా.. 60ఏళ్లు పైబడిన వారిని ఓల్డ్ ఏజ్ సంఘాల్లో, వికలాంగులకు ప్రత్యేక సంఘం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కిషోర బాలికలు 15 నుంచి 18 ఏళ్లు ఉన్నవారిని కూడా ఈసారి అవకాశం కల్పించనుండగా.. ఖమ్మం మహిళ మార్ట్‌లో మహిళలు తయారు చేసిన వస్తువులు, వంటకాలు తయారు చేసేలా ముందుకు రావాలని, ఒక్కో గ్రామం ఒక ప్రోడక్ట్ తయారు చేయాలన్నారు. ఓపెన్ స్కూళ్లను వినియోగించుకోవాలని సూచించారు. సీసీలు బండ్ల నాగేశ్వరావు, రవి, భీష్మ, వెంకన్న, అనిత, లక్ష్మి, జమీల, మండల సమాఖ్య అధ్యక్షురాలు నస్రీన్, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

'క్విట్ కార్పొరేట్' నినాదంతో బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: భారతదేశ ప్రయోజనాలకు హాని కలిగించే ప్రత్యేక వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏ) అమెరికాతో చేసుకోకూడదని డిమాండ్ చేస్తూ రైతు సంఘాలు ఖమ్మంలో బుధవారం జెడ్పీ సెంటర్ నుంచి పెవిలియన్ గ్రౌండ్ వరకు ద్విచక్ర వాహనాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు పోతినేని సుదర్శన్, మొక్క శేఖర్‌గౌడ్, కొల్లేటి నాగేశ్వరరావు, ప్రకాష్, రవి మాట్లాడుతూ.. భారత ఉత్పత్తులపై అమెరికా విధించిన సుంకాలను వ్యతిరేకించాలని, వ్యవసాయ మార్కెటింగ్‌పై కొత్త జాతీయ సహకార విధానాన్ని రద్దు చేయాలని, పంటలకు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ రంగ ప్రైవేటీకరణను నిషేధించాలని, పెండింగ్ విద్యుత్ బిల్లులను మాఫీ చేయాలని, మత హింసను ఆపాలని, ఖరీఫ్ పంటల నష్టాన్ని సర్వే చేసి పరిహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా ఖమ్మం జిల్లా నాయకులు నున్నా నాగేశ్వరరావు, బొంతు రాంబాబు, మాదినేని రమేష్, పొన్నం వెంకటేశ్వరరావు, మేరుగు సత్యనారాయణ, శ్రీనివాసరావు, తాటి వెంకటేశ్వరరావు, మల్లీదు నాగేశ్వరరావు, పాశం అప్పారావు, లాజర్, మందుల రాజేంద్రప్రసాద్, ఎస్‌కె.మీరా, ఎస్‌కె.ఖాసిం, దాసరి పూర్ణ, దేవర శంకర్‌నాయక్, నూకరపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.